
శేషాచలానికి తిరుకల్యాణోత్సవ శోభ!

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సర్వాభరణ భూషితుడైన శ్రీనివాసుడు పెండ్లికుమారునిగా, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు పెండ్లికుమార్తెలుగా ఉత్సవ మూర్తులను ముస్తాబు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు నూతన వస్త్రాలు సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్వీ ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారు శ్రీమహావిష్ణువు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణం వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ★ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా స్వామి, అమ్మవార్ల ముస్తాబు



గజ వాహనంపై..

నేత్ర పర్వం చిన వేంకన్న గ్రామోత్సవం .. విజయ దశమి రోజున ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి అమ్మవార్లను రాజాధిరాజ వాహనంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గజ వాహనంపై చిన్న వేంకన్న గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి పల్లె పండగ

ఉమ్మడి జిల్లాలో వారం రోజుల పాటు నిర్వహణ

ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో భూమి పూజలు



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పల్లెల్లో నేటి నుంచి అసలైన పండగ ప్రారంభం కానుంది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక, గత లోపాలు సరిదిద్దుతోంది. పల్లె ప్రగతికి ముందడుగు వేస్తోంది. తాజాగా 'పల్లె పండగ' పేరిట సోమవారం నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 937 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం పొందిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ వారోత్సవాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కానున్నారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..

జిల్లా	పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఏలూరు	1,862	137.27
పశ్చిమ	423	51.03

గ్రామాల్లో బోర్డుల ఏర్పాటు.. ప్రతి పంచాయతీలో ఈ ఏడాది చేసే అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలి. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు సంబంధించి దండోరా వేయించాలి. భూమి పూజలకు సంబంధించి పంచాయతీల్లో ముందస్తుగా ప్రచారం కల్పించాలి. అభివృద్ధి పనులు, భూమి పూజల వివరాలు ప్రజాప్రతినిధులకు ముందుగానే తెలియజేయాలి. ఎక్కడెక్కడ ఏయే పనులు ప్రారంభించి, ఎప్పటికి పూర్తి చేస్తారన్న పూర్తి వివరాలు గ్రామ సభలో ప్రజలకు వివరించేలా బోర్డులుండాలని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. భూమి పూజలకు గ్రామ పంచాయతీలు, తేదీల వారీగా రోడ్ మ్యాప్ షెడ్యూల్ అమలు చేయడం, మంజూరైన పనులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎప్పటికప్పుడు పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

అంతు లేని భూ దాహం



ఈనాడు, ఏలూరు: జిల్లాలో అసైన్డ్, భూదాన్, కొల్లేరు అయిదో కాంటూరులోని అభయారణ్యం భూములు రెండు లక్షల ఎకరాల వరకు ఉన్నాయి. భూదాన్, అసైన్డ్ భూములను భూముల్లేని పేదలకు ప్రభుత్వం గతంలోనే ఇచ్చింది. స్థానిక తహసీల్దారు ద్వారా లబ్ధిదారులు పట్టా పొందాలి. అప్పుడే ఆ భూమి వారి పేరుకు మారుతుంది. కానీ ఈ విషయం తెలియని చాలా మంది పట్టాలు తీసుకోలేదు. కొన్ని చోట్ల కాగితాల్లో భూ పంపకాలు జరిగినా క్షేత్రస్థాయిలో మాత్రం అప్పటి భూస్వాములే సాగు చేస్తున్నారు.

● భీమడోలు మండలం పూళ్లలోని సర్వే నంబర్ 700-710 మధ్యలో దాదాపు 11.6 ఎకరాల భూమి రికార్డులను అడ్డగోలుగా మార్చేశారు. దశాబ్దాల కిందట పేదలకు భూదాన ఉద్యమంలో ఇచ్చిన భూములను అనువంశికంగా సక్రమించినట్లు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి 1బీ అడంగల్ సృష్టించారు. దీంతో పేదలకు చెందాల్సిన భూదాన్ భూమి పెద్దల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది.

● భీమడోలు మండలం పరిధిలోని అభయారణ్యంలో దాదాపు 130 ఎకరాలు భీమవరానికి చెందిన వైకాపా నేత కొన్నేళ్ల కిందట ఆక్రమించుకున్నారు. అయిదో కాంటూరు పరిధిలోని అభయారణ్యంలో ఆక్రమణలు నేరం. అయినా దశాబ్దాలుగా ఏ అధికారి కన్నెత్తి చూడలేదు. వైకాపా పాలనలో అదే అదనుగా రికార్డులు మార్చి అభయారణ్యం నుంచి తొలగించి పట్టాలు పుట్టించారు.

చక్రం తిప్పిన అధికారి.. భీమడోలులో ఈ తరహా కుంభ కోణంలో గతంలో విధులు నిర్వహించిన అధికారి ఒకరు కీలకంగా వ్యవహరించారు. స్థానిక వైకాపా నేతల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పాత రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉన్న వేలాది ఎకరాల భూములు అనువంశికం అంటూ మార్చేశారు. ఒక్క భీమడోలు మండలంలోని పూళ్ల, ఎంఎంపురం, కొండ్రుపాడు తదితర గ్రామాల్లో ఈ తరహా అక్రమాలకు పాల్పడ్డారు. అసైన్డ్ భూములు పంపకాలు చేసినప్పుడు ఎంఎంపురంలో ఓ ఎకరం భూమి కొల్లేరు అభయారణ్యంలో చూపించడంతో లబ్ధిదారులకు ఇవ్వలేదు. అలాంటి భూమిని సైతం ఆ ముడుపులు తీసుకుని మార్చేశారు. ఎకరం భూమి రికార్డు మారిస్తే రూ.2 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వీఆర్వోల సాయంతో ఈ బాగోతం నడిపారు.

కొల్లేరు అయిదో కాంటూరు పరిధిలో ఆక్రమణలు, చెరువుల సాగు చేయడం నిషేధం. ఆగడాలలంక, చెట్టున్నపాడు, ఎంఎంపురం ఇలా ప్రతి చోటా కొల్లేరు పరిధిలోని భూములను రెవెన్యూ భూములుగా మార్చేశారు. రూ.కోట్లు సంపాదించి ఇటీవలే మరో మండలానికి బదిలీపై వెళ్లిపోయారు. దీనిపై జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పాత రికార్డులు పరిశీలించి అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సర్దుతూ.. సరిదిద్దుతూ!

ప్రక్షాళన దిశగా ప్రజాపంపిణీ వ్యవస్థ

చౌకదుకాణాల పెంపునకు కసరత్తు

పాలకొల్లు, న్యూస్‌టుడే

... గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేసింది. అవసరం లేకపోయినా ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టి కేవలం బియ్యం పంపిణీ చేసి చేతులు దులిపేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజాపంపిణీ వ్యవస్థపై దృష్టిసారించింది. నిత్యావసరాలు కొండెక్కి కూర్చున్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ సరకులు చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించి ఇప్పటికే పంచదార, కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇతర సమస్యలను అధిగమించడానికి తీవ్ర కసరత్తు చేస్తుంది.

యలమంచిలి మండలం కనకాయలంకలో 950 వరకు బియ్యం కార్డులున్నాయి. ఇవన్నీ ఒకే చౌక దుకాణంలో ఉండటంతో వరదల సమయంలో ఇక్కడ నిత్యావసరాలు పంపిణీ చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే మండలంలోని బాడవలోను ఇదే పరిస్థితి. ఇటువంటి గ్రామాల్లో రెండో చౌక దుకాణం ఏర్పాటు చేసి సమస్యను అధిగమించడంతోపాటు మరొకరికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది.

400 కార్డులకో దుకాణం.. జిల్లాలో చాలా చోట్ల చౌక దుకాణాల్లో 800 నుంచి 900కు పైబడి బియ్యం కార్డులున్నాయి. కొన్ని దుకాణాల్లో రెండుమూడొందల కార్డులే ఉన్నాయి. దీనివల్ల ఎక్కువ కార్డులున్న డీలర్లకు కమీషన్ ఎక్కువ రావడం తక్కువ ఉన్నవాళ్లకు తక్కువగా వస్తుండటం జరుగుతోంది. ఆయా వ్యత్యాసాలను సరిచేయడంతోపాటు పంపిణీని సులభతరం చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తగ్గట్టుగా అన్ని మండలాల్లోనూ 800 కార్డులు దాటి ఉన్న చౌక దుకాణాలను రెండుగా విభజించడానికి రంగం సిద్ధమయ్యింది. రెండో దుకాణం ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 దుకాణాల వరకు కొత్తవి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో వివరాలిలా..

జిల్లా	మొత్తం కార్డులు	చౌక దుకాణాలు	ఎండీయూ వాహనాలు
ఏలూరు	6,31,044	1,052	358
పశ్చిమ	5,67,651	1,135	343

కొత్తకార్డులు సైతం.. గత వైకాపా ప్రభుత్వం ఆరంచెల తనిఖీల్లో చాలా మంది లబ్ధిదారులు బియ్యం కార్డులు కోల్పోయారు. వీరందరిని ఆదుకోవడానికి త్వరలో కొత్త బియ్యం కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కార్డులో సభ్యుల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిన ప్రభుత్వం కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసి కార్డులను సర్దుతూ గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దడానికి సమాయత్తమయ్యింది. దీనిపై పశ్చిమలోని పౌరసరఫరాల సంస్థ సహాయ అధికారి రవిశంకర్‌ను సంప్రదించగా జిల్లాలో కొత్తగా 60 చౌక దుకాణాల వరకు పెరుగుతాయని చెప్పారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. రాష్ట్ర గనుల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆదివారం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ఏలూరు నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నదీ తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల టెండర్ల ప్రక్రియ, జిల్లా ఇసుక కమిటీలో ఆమోదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలపై సమీక్షించారు. అనంతరం వెట్రిసెల్వి మాట్లాడుతూ... ఇసుక తవ్వకాలు, తరలింపు ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెంచాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి జీపీఎస్ కలిగిన వాహనాల ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నామన్నారు. ఇసుక పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఉంచామని, సిబ్బందిని సైతం నియమించామని ఆమె పేర్కొన్నారు.

దోబూచులాడుతున్న గోదారమ్మ

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి వరద దోబూచులాడుతోంది. కొన్ని రోజులుగా ఉదయం పెరిగి సాయంత్రానికి తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం ఉదయం 26.97 మీటర్లు ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 26.96కి తగ్గింది. 48 గేట్ల ద్వారా 88.73 వేల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరులశాఖ అధికారులు చెప్పారు.

'టెట్'కు 162 మంది హాజరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన పరీక్షకు 185 మంది అభ్యర్థులకు 162 మంది హాజరయ్యారు. మిగతా 23 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.



రవాణాశాఖ విస్తృత తనిఖీలు

60 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో రవాణా శాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ షేక్ కరీం మాట్లాడుతూ... దసరా పండగ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో టిక్కెట్ ధరలు వసూలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నట్లు సమాచారం అందిందన్నారు. రవాణా శాఖాధికారులు జిల్లాలో ప్రధాన ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల్లోనూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. పర్మిట్ లేకుండా వాహనాలు నడపడం, అధిక పరిమాణంలో రవాణా చేస్తుండటం తదితరాలు తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 60 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఇకపై తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐలు, ఏఎంవీలు తదితరులు పాల్గొన్నారు.

కీలక దశలో మరో గండం!

వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల్లో కలవరం

ఉండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణశాఖ హెచ్చరికలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. మెట్ట మండలాల్లో ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో వరి కోతలు ఇప్పటికే ప్రారంభంకాగా మరో పది రోజుల్లో ఊపందుకునే అవకాశాలున్నాయి. డెల్టాలో అధికశాతం చేలు చిరుపొట్ట నుంచి పూత దశలో ఉన్నాయి. ఈ దశలో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు పాటించండి.. చేలు పూత దశలో ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే తాలు గింజల శాతం పెరిగే ప్రమాదముందని మార్టేరు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కృష్ణాజీ తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత ప్రొపికొనజోల్ ఒక ఎంఎల్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చేలకు సమీపాన మురుగు బోదెల్లో నీటి పారుదలకు అవరోధాలు లేకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు సూచించారు.

ఇప్పటికే రెండుసార్లు నష్టం..!.. జులైలో కురిసిన అధిక వర్షాలకు పశ్చిమ డెల్టాలో నారుమడి దశలో 30 వేల ఎకరాలకు సరిపడే నారుమడులు, 15 వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. అప్పట్లో 80 శాతం రాయితీపై 3,500 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఆగస్టు, సెప్టెంబరుల్లో కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో 8,798 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారికంగా గుర్తించారు. దీనికి సంబంధించి 6,312 మంది రైతులకు రూ.8.90 కోట్ల పెట్టుబడి రాయితీని ప్రభుత్వం అందించింది. మొత్తంగా 2.11 లక్షల ఎకరాలకుగాను 2,03,060 ఎకరాల్లోనే పంట సాగైందని తేల్చారు.

అస్తవ్యస్త డ్రెయిన్లతో అవస్థలు.. డెల్టాలో వశిష్ఠ, కొల్లేరు, ఉప్పుటేరు బేసిన్ల పరిధిలో 21 మేజర్, 59 మీడియం, 579 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. వైకాపా హయాంలో వీటి నిర్వహణ, పూడిక, ఆక్రమణల తొలగింపు వంటి పనులు చేపట్టకపోవడంతో మురుగు పారుదల వ్యవస్థ అధ్వానంగా మారింది. రెండ్రోజులు వర్షాలు కురిస్తే చాలు పల్లపు ప్రాంతాల్లో చేలు ముంపు బారిన పడుతున్నాయి.



ఉండి కేవీకే ప్రాంగణంలో గింజ గట్టిపడే దశలో ఉన్న విత్తన చేలు

15న 'మీ కోసం'

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ- మీ కోసం'ను మంగళవారానికి వాయిదా వేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పుష్పమణి తెలిపారు. సోమవారం మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తున్నందున... మరుసటి రోజుకు కార్యక్రమం వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల సాకు.. పైపైకి సోకు

మాటేసి.. కాటేసి

6లో

చేపల వేటకు వెళ్లొద్దు

నరసాపురం, న్యూస్‌టుడే: సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఆర్డీవో దాసి రాజు మత్స్యకారులకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర అలలు ప్రమాదకరంగా ఉంటాయని, తదుపరి ప్రకటన వెలువడే వరకూ చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు. ఇప్పటికే సముద్రంలోకి వేటకు వెళ్లిన వారంతా వెంటనే తీరానికి తిరిగి రావాలన్నారు.

ఉత్కంఠకు తెర!

☛ నేడు మద్యం దుకాణాల టెండర్ల ఖరారు ☛ జిల్లాలో 144కు 5,499 దరఖాస్తులు



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల ఖరారుకు సోమవారం టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొత్తం 144 దుకాణాలకు 5,499 దరఖాస్తులందాయి. వాటికి సీల్ వేసి బాక్స్‌ల్లో భద్రపరిచారు. కలెక్టర్ వెట్రిసెల్వి సమక్షంలో ఎక్సైజ్ అధికారులు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నారు. మినీ బైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో ఉదయం 8 గంటలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో... అన్నిటికీ టెండర్లు ఖరారు చేసేటప్పటికి అర్ధరాత్రి దాటుతుందని భావిస్తున్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం దరఖాస్తులకుగాను ఏలూరు జిల్లాకు రూ. 109.98 కోట్లు సమకూరింది. మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహిస్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 7కల్లా చలసాని గార్డెన్స్‌కు చేరుకోవాలని, తమ వెంట ఎంట్రీ పాస్, ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య తెలిపారు. దరఖాస్తుదారు తనకు బదులుగా వేరొకరిని పంపితే, అతనికి వ్యక్తిగత డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. ● ఏలూరులో సందడి నెలకొంది. దరఖాస్తుదారులతో పాటు వారి అనుయాయులు నగరానికి చేరుకుంటున్నారు. వీరితో లాడ్జిలు, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి.

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
ఏలూరు	41	784
చింతలపూడి	16	784
భీమడోలు	22	1107
పోలవరం	12	599
జంగారెడ్డిగూడెం	16	961
నూజివీడు	16	676
కైకలూరు	21	588

పటిష్ఠ బందోబస్తు.. మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించే చలసాని గార్డెన్స్‌ను ఆదివారం రాత్రి ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డీసీ శ్రీలత, ఎక్సైజ్ ఎస్పీ ఆవులయ్య తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. ఇద్దరు డీఎస్పీలు, అయిదుగురు సీఐలు, 16 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఇలా మొత్తం 119 మందిని బందోబస్తు విధులకు కేటాయించామన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు.. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు నుంచి హనుమాన్ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను మినీ బైపాస్ మీదుగా కాకుండా జూట్‌మిల్ వద్ద దారి మళ్లించి వైవంతెన మీదుగా అగ్నిమాపక కేంద్రం, కొత్త బస్టాండ్, సత్రంపాడు మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. హనుమాన్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను సైతం సత్రంపాడు మీదుగా మళ్లించామని పేర్కొన్నారు.

దేవుడిలా వచ్చాడు..!

● యువకుడి సాహసం.. ● ఇద్దరికి పునర్జన్మ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ యువకుడు చూపించిన తెగువ, ధైర్యం ఇద్దరికి పునర్జన్మనిచ్చింది. కాలువలో కారు మునిగిపోతుంటే అయ్యో అంటూ చూస్తున్నారే తప్ప ఎవరు దిగేందుకు సాహసం చేయలేదు. ఓ యువకుడు మాత్రం ఏం ఆలోచించకుండా వారిని రక్షించాలన్న లక్ష్యంతో కాలువలోకి దూకేశారు. ఇంతకీ అతడికి ఈత రాకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. తణుకుకు చెందిన దాసరి రాంబాబు ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె మౌనికదేవి చెన్నైలో ఉద్యోగం చేస్తూ దసరా సెలవులకు వచ్చింది. శనివారం తండ్రితో కలిసి కారులో మండపాక యల్లారమ్మ ఆలయానికి బయల్దేరారు. వెంకటరాయపురం ఆంధ్ర సుగర్స్ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి గోస్తనీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పెరవలి మండలం నల్లాకులవారిపాలెంకు చెందిన మెర్ల సాయిబాబు తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కాలువలోకి దూకి వారిని రక్షించే ప్రయత్నం చేశారు. రోడ్డుపై ఉన్న మరో వ్యక్తి అతనికి అందించిన సుత్తితో కారు అద్దాలు పగలుగొట్టి ఇద్దరినీ ప్రాణాలతో ఒడ్డుకు తెచ్చారు. ఈత రాకపోయినా ప్రాణాలకు తెగించి, వారిని కాపాడటంతో స్థానికులు అతడిని అభినందించారు.

● రాంబాబు భార్య కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యారు. ఈ తరుణంలో కారులో మునిగిపోతుండగా ఆమె పరిస్థితి ఏమిటి..? ఆమెను ఎవరు చూసుకుంటారు...? అనే ఆలోచన తనను కలచివేసిందంటూ సాయిబాబును రాంబాబును హత్తుకుని కన్నీరు మున్నీరయ్యారు. ● స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ, సాయిబాబును ఘనంగా సత్కరించారు. సాయిబాబుకు జ్ఞాపిక అందించి, రూ.10వేల నగదు బహుమతిగా అందించి, అభినందించారు.



కాలువలో పడిపోయిన కారులో వ్యక్తులను కాపాడటానికి ప్రయత్నిస్తున్న సాయిబాబు (అంతరచిత్రం)

లెక్క తేల్చనున్న విజిలెన్స్!

మార్కెట్ యార్డుల ఆదాయ, వ్యయాలపై తనిఖీలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రైతు సేవల కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు గత వైకాపా ప్రభుత్వ హయాంలో వారి శ్రేయస్సును విస్మరించాయి. మార్కెట్ యార్డుల ఆదాయాన్ని వైకాపా సర్కారు దారి మళ్లించడంతో రైతులకు అవసరమయ్యే పుంత మార్గాలు, నూర్పిడి కల్లాలు అభివృద్ధికి నోచుకోలేదు. కొన్ని యార్డుల పరిధిలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం గత కమిటీలను రద్దు చేయడంతోపాటు ఆదాయ, వ్యయాల లెక్కతేల్చేందుకు జిల్లాల వారీగా విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేసింది.

ఈ నెలలో ప్రారంభం.. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో తనిఖీ కేంద్రాల ద్వారా రెండు శాతం పన్ను వసూలు చేస్తారు. కొన్ని చోట్ల సిబ్బంది చేతివాటంతో ఆదాయం దారి మళ్లుతుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మార్కెట్ కమిటీల ద్వారా లైసెన్సులు పొందిన ఆక్వా వ్యాపారులు విధిగా రుసుములు చెల్లిస్తున్నారా.. ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేశారా లేదా అనే అంశాలను విజిలెన్సు కమిటీ పరిశీలించనుంది. ఈ నెలలోనే తనిఖీలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆదాయ, వ్యయాలకు సంబంధించి అన్ని మార్కెట్ యార్డులు, తనిఖీ కేంద్రాల్లో దస్త్రాలను పరిశీలిస్తామని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె.సునీల్‌కుమార్ తెలిపారు.



ఆదాయం రూ.100 కోట్లు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 మార్కెట్ యార్డులు ఉండగా వీటి పరిధిలో ఉన్న 50 తనిఖీ కేంద్రాల ద్వారా ఏటా సగటున రూ. 100 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఏలూరు జిల్లాలో 9 యార్డుల ద్వారా రూ. 40 కోట్లు, పశ్చిమగోదావరిలో 10 యార్డుల ద్వారా రూ. 60 కోట్లు ఆదాయం వస్తోంది.

కమిటీ సభ్యులు వీరే.. పశ్చిమగోదావరి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్ కుమార్ నేతృత్వంలో తాడేపల్లిగూడెం, ఉండి, ఆకివీడు యార్డుల కార్యదర్శులు విజిలెన్సు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.



హరివిల్లు.. విరిజల్లు..!

దసరా పండగ రోజున దెందులూరు మండలం కొవ్వలిలో హరివిల్లులు కనువిందు చేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ, వాన దోబూచులాడగా- సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వానజల్లు ఆగాక, ఆకాశంలో ఒక్కసారిగా రెండు హరివిల్లులు ఆవిష్కృతమయ్యాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకించగా- మరికొందరు తమ ఫోన్లలో క్లిక్‌మనిపించారు. - ఈనాడు, దెందులూరు

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు



నూజివీడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది, కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, ఇతర లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ కాలం గడిపారు. అత్యవసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం ఇబ్బందులు పడేవారు. రక్షిత తాగునీరు అందుబాటులో ఉండేది కాదు. జిల్లాలో చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అయిదేళ్లలో సౌకర్యాలు కల్పించాలన్న విషయాన్ని గత ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. సొంత భవనాలున్న చోట్ల అవసరమైన కనీస వసతులు కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతలు జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, ఒక్కో ఆర్వో ప్లాంటుకు రూ.17 వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం..

జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- పద్మావతి, ఐసీడీఎస్, పీడీ ఏలూరు

సమాచారం ఇలా...				
జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2,225	మరుగుదొడ్లు మంజూరైనవి 227	కేటాయించిన నిధులు రూ.81,72,000	తాగునీటి సౌకర్యం మంజూరైన కేంద్రాలు 186	కేటాయించిన మొత్తం రూ.31,62,000





గరళ గోదారి..!

స్వచ్ఛమైన గోదావరి నదిలో వ్యర్థ జలాలు చేరడంతో కలుషితమవుతోంది. నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని మురుగు నీటిని శుద్ధిచేయడం లేదు. కాలువల నుంచి నేరుగా గోదావరిలో కలుస్తోంది. దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని ఘాట్లలో స్నానాలు చేసే భక్తులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి మురుగు నీటిని శుద్ధిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నరసాపురం పురపాలక కమిషనర్ మల్లారపు అంజయ్య మాట్లాడుతూ తాను ఇటీవలే వచ్చానని క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. నరసాపురంలోని మహాప్రస్థానం సమీపంలోని ఎర్రని గోదావరిలో నల్లని మురుగు కలుస్తున్న చిత్రాలివి. - ఈనాడు, నరసాపురం



భవన సముదాయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి తదితరులు

2026 నాటికి వసతి గృహాలు పూర్తి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వసతి గృహాల నిర్మాణాలను 2026 నాటికి పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని వసతి గృహ సముదాయ నిర్మాణాలను ఆదివారం పరిశీలించారు. తొలుత ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆపై అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు భవన నిర్మాణాల మ్యాప్‌ను ఎమ్మెల్యేకు చూపి వివరించారు. చంటి మాట్లాడుతూ...ఉమ్మడి జిల్లాకే తలమానికంగా సర్వజన ఆసుపత్రిని, దానికి అనుగుణంగా వసతి గృహాలను తీర్చిదిద్దుతామన్నారు. వసతి గృహానికి అవసరమైన మరో ఒకటిన్నర ఎకరా స్థలం కేటాయింపు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపుతామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్ తదితరులున్నారు.

విజయోస్తు!



పూజల్లో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ దంపతులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పోలీసు శాఖకు విజయాలు సిద్ధించాలని... శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని.. ప్రజలు ప్రశాంతంగా జీవించాలని కోరుతూ ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి దంపతులు ఆయుధ పూజ చేశారు. దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని ఏఆర్ ఆయుధ కార్మాగారం వద్ద శనివారం ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాటేసి.. కాటేసి!

కుక్కల బెడదతో బెంబేలు



జంగారెడ్డిగూడెం పట్టణం, చింతలపూడి, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

● జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువకుడు ఈ నెల 1న స్థానిక ప్రభుత్వ కళాశాల రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతూ కుక్కల గుంపును చూసి భయంతో వాహనం వేగం పెంచాడు. అయితే అవి వెంటబడటంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. రక్తగాయాలయ్యాయి.

● పోలవరంలో సెప్టెంబరు 20న ఆరేళ్ల బాలికపై వీధికుక్కలు దాడి చేశాయి. అదే రోజు రోడ్డుపై వెళుతున్న మరో నలుగురిని కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రాంతీయ ఆసుపత్రి	కుక్కకాటు బాధితులు
2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ...	జంగారెడ్డిగూడెం	1015
2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ....	జంగారెడ్డిగూడెం	558
2023	నూజివీడు	2036
2024- ఇప్పటి వరకూ...	నూజివీడు	1396
2024 జనవరి నుంచి ఇప్పటి వరకూ...	చింతలపూడి	308

● టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లిలో ఈ నెల 9న ముగ్గురు వ్యక్తులపై కుక్కల గుంపు దాడిచేసింది. గాయపడిన వారిని కుటుంబసభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● మూడు నెలల కిందట నూజివీడు మండలం వెంకటాయపాలెంలో ఓ బాలుడు, నూజివీడు బాపూనగర్‌లో ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడిచేశాయి.



జంగారెడ్డిగూడెం పట్టణంలో శునకాల సంచారం

చింతలపూడి, నూజివీడు, పోలవరం నియోజకవర్గాల్లో గ్రామ సింహాల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లే వారినే కాకుండా ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిపై సైతం దాడులు చేస్తున్నాయి. దీంతో చింతలపూడి నియోజకవర్గంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. బాధితుల్లో కొందరు ఆసుపత్రులకు వెళుతుంటే మరికొందరు నాటు వైద్యం, పసరు మందులు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం పురపాలక కమిషనర్ కేవీ రమణ తెలిపారు. శునకాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితే తప్ప అధికారుల్లో చలనం ఉండటం లేదని ప్రజలు బాహటంగానే ఆరోపిస్తున్నారు.

547 పంచాయతీల్లో 'పల్లె పండగ'

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 547 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి వారం రోజులపాటు పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఉపాధిహామీ నిధులు రూ.121.57 కోట్ల అంచనా వ్యయంతో 1,917 పనులకు ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తారన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీడీ లంచం అడిగారని వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ ఉప తహసీల్దారు రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో... ఓ బియ్యం వ్యాపారి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. స్థానిక పడమరవీధికి చెందిన జంజ్యావుల సుధాకర్ అలియాస్ నాని బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఈయన చుట్టుపక్కల ప్రాంతాల్లో కోటా బియ్యం కొని అధిక ధర విక్రయిస్తుంటారు. ఈ నెల 11న పెదవేగి మండలం పినకడిమిలో బియ్యం కొనుగోలుకు వెళ్లారు. అక్కడికొచ్చిన పెదవేగి ఉప తహసీల్దార్ ప్రమోద్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నావని, కేసు నమోదు చేస్తానని.. రూ.50 వేలు ఇస్తే వదిలేస్తానని హెచ్చరించారు. అంత మొత్తం ఇవ్వలేనని చెప్పడంతో అతడిపై కేసు నమోదు చేశారు. దాంతో మనస్తాపానికి గురైన సుధాకర్ ఈ నెల 12న పురుగుమందు తాగి పెదవేగి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆపై కుమారుడికి కబురు చేస్తే అతను హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీనిపై డీటీని వివరణ కోరగా- సుధాకర్ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కలిగి ఉన్నాడన్న సమాచారంతో పినకడిమిలో తనిఖీలు చేశామన్నారు. అతడి వద్ద 650 కిలోల బియ్యం గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. అతని వద్ద డబ్బు డిమాండ్ చేశామన్నది అవాస్తవమని ఆయన పేర్కొన్నారు.

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి.. మాజీ ఎంపీ రూ.కోటి విరాళం

కోలమూరు (ఉండి), న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి విరాళం అందజేస్తున్నట్లు మాజీ ఎంపీ బీదా మస్తాన్‌రావు ప్రకటించారు. ఉండి మండలం కోలమూరు గ్రామంలో పేరిచర్ల బాలరాజుకు చెందిన ఆక్వా మేతల దుకాణాన్ని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజులతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటి విరాళం ప్రకటించడం ఊహాతీతమని.. ఇది నిజమైన విజయదశమి అని అభివర్ణించారు. మా మిత్రుడు.. కాబోయే రాజ్యసభ సభ్యుడు ఇస్తున్న ఈ విరాళాన్ని ప్రభుత్వం ఇచ్చే రూ.5 కోట్లతో సమానంగా తాను భావిస్తున్నానని తెలిపారు. చెరువు సాంద్రత ఆధారంగా రొయ్య సీడ్ వేయాలని సూచించారు. విద్యుత్తు రాయితీ అంశాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి సంక్రాంతికి అమలయ్యేలా కృషి చేస్తామని వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, తెదేపా, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మస్తాన్‌రావుతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, చిత్రంలో ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు

ఎల్‌జీ షోరూం ప్రారంభం



ప్రారంభోత్సవంలో సంస్థ అధినేతలు, మేనేజర్లు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ఆర్‌ఆర్‌పేట రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌జీ షోరూంను ఎల్‌జీ రీజినల్ మేనేజర్ కె.వెంకటకృష్ణాజి, బ్రాంచి మేనేజర్ పి.కిశోర్‌బాబు ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దసరా పండగ సందర్భంగా నూతన షోరూంలో 26 శాతం క్యాష్ బ్యాక్, రూపాయికే డౌన్ పేమెంట్, 888లాంటి ఫ్లెక్సీ ఈఎంఐ, మూడేళ్ల వారెంటీ తదితర అద్భుత ఆఫర్లు ఇస్తున్నామన్నారు. అవకాశాన్ని ఏలూరు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సాయి ఎంటర్ ప్రైజెస్ సంస్థ అధినేత సుంకర రాజేశ్, సుంకర సురేశ్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణలో వక్క సాగుపై కార్యాచరణ



పోలాసిగూడెంలో తోట పరిశీలిస్తున్న మంత్రి నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిపుణులతో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో వక్క తోటల సాగుపై తగిన కార్యాచరణ చేపడతామని ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కామవరపుకోట మండలం పోలాసిగూడెంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. గ్రామంలోని రైతులు సాగుచేస్తున్న వక్క, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చాలా మంది కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా వక్క సాగు చేస్తున్నారని, ఇది మంచి లాభదాయకంగా ఉందని రైతులు, నిపుణులు చెబుతున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తుమ్మల వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, పోలాసిగూడెం సర్పంచి మధు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సాకు.. పైపైసోకు!

● మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు

గుత్తేదారు కాసుల కక్కుర్తి.. అధికారుల ధన దాహార్తి.. వెరసి రోడ్డు మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ఫలితంగా రూ.కోటి వెచ్చించి చేపట్టిన పనులు ఆర్నెల్లకే అధ్వానంగా తయారయ్యాయి. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే, తామంతా ఎన్నికల విధుల్లో ఉన్నామని, పనులను పర్యవేక్షించలేక పోయామని చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, దెందులూరు, ఏలూరు గ్రామీణ



అధ్వానంగా ఫిల్‌హౌస్ పేట రోడ్డు

జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో ర.భ. శాఖకు చెందిన ఎం.డి.ఆర్. రోడ్లకు వైకాపా ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో ఏలూరు చాటపర్రు రోడ్డు నుంచి కైకలూరు రోడ్డు వరకు(ఫిల్‌హౌస్‌పేట మీదుగా వెళ్లు రహదారి), ఏలూరు జూట్‌మిల్లు వంతెన నుంచి గడియారపు స్తంభం మీదుగా కైకలూరు రోడ్డు, ఏలూరు పాత బస్టాండు నుంచి గజ్జలవారిచెరువు మీదుగా చాటపర్రు రహదారి, ఏలూరు పాత బస్టాండ్ నుంచి కొమడవోలు రహదారికి అత్యవసర మరమ్మతులు చేయాలని ఆదేశించింది. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల నాని జనవరి 22న శంకుస్థాపన చేశారు. సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి విడుదల అవుతుందోమోనని హడావుడిగా మరమ్మతులు పూర్తి చేశారు. ఈ నాలుగు రహదారుల్లో ఒకటైన ఫిల్‌హౌస్‌పేట రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించారు. మిగతా రోడ్లకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి మాయ చేశారు.

నేతి బీర చందం..

ఈ పనుల్లో నాణ్యత నేతి బీర చందంగా మారింది. రహదారుల పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా తయారైంది. తొలకరి వర్షాలు కురిసిన కొన్నాళ్లకే రోడ్లకు గుంతలు పడటం మొదలైంది. ఇటీవల కురిసిన భారీ వానలకు మరింత ఛిద్రమయ్యాయి. ప్రధానంగా ఫిల్‌హౌస్ పేట రహదారిలో రాకపోకలు సాగించేందుకు చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణ థియేటర్ కూడలిలో భారీ గుంతలు పడ్డాయి. గూడ్స్ షెడ్ రోడ్డు మినహా మిగతా మూడు రోడ్లు కైకలూరు రహదారిని కలిపే దగ్గర మార్గాలు. కైకలూరు మీదుగా భీమవరం, పాలకొల్లు, నరసాపురం వెళ్లే వాహనాలు ఈ రహదారుల్లోనే రాకపోకలు సాగిస్తుంటాయి. కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే వాహనాలకు ఈ దారులే ఆధారం. ప్రధాన రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ డీఈఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా... ఆయన అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి మృతి



బాలరాజు (పాత చిత్రం)

కుక్కునూరు, అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి చెందిన దుర్ఘటన ఆదివారం రాత్రి అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కుక్కునూరు మండలం వింజరం పంచాయతీ సర్పంచి జగిడి బాలరాజు(34) స్వగ్రామం బర్లమడుగు నుంచి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలం నందిపాడు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి కుడుములపాడు వద్ద కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో బాలరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడ్ని స్థానికులు ఆటోలో అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుని భార్య పుష్పాంజలి కుక్కునూరు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి.. పెదవేగి, న్యూస్‌టుడే: జేసీబీని నీటితో శుభ్రం చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెదవేగి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కె.రామకృష్ణ కథనం మేరకు.. జగన్నాథపురానికి చెందిన మాత్రపు వెంకటేశ్వరరావు(25) తన సమీప బంధువు వద్ద జేసీబీ చోదకుడిగా పని చేస్తున్నారు. ఇంటి వద్ద విద్యుత్తు మోటారు వేసి జేసీబీని శుభ్రం చేస్తుండగా- ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు... స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. గులాబీరంగు చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏలూరు కాలువలో వృద్ధురాలి మృతదేహం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కాలువ సమీప కనకదుర్గమ్మ ఆలయంలో పూజల అనంతరం... రేవులో కాళ్లు కడుక్కునేందుకొచ్చి ప్రమాదవశాత్తూ జారి పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు... ఏలూరు పాత బస్టాండ్ సమీప పాండురంగాపురానికి చెందిన వీరంకి విజయలక్ష్మి(77)కి భక్తి భావం ఎక్కువ. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. ఈ నెల 11 రాత్రి బావిశెట్టివారిపేట కృష్ణా కాలువ ఒడ్డున్న కనకదుర్గమ్మ ఆలయానికి విజయలక్ష్మి వెళ్లారు. ఆ తర్వాత ఇంటికి తిరిగిరాలేదు. 12న ఆలయానికి కొద్దిదూరంలో వృద్ధురాలి మృతదేహాన్ని కనుగొన్నారు. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ మృతదేహాన్ని వెలికి తీయించి సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సీఐ సత్యనారాయణ ఆదేశానుసారం రైటర్ రాధాకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

అమ్మే లోకమని.. ఆమె లేక జీవించలేనని!

అతనికి అమ్మే లోకం.. ఆమె సర్వస్వం.. నాలుగేళ్ల వయసులో నాన్న చనిపోగా- అన్నీతానైంది తల్లి. ఎన్నడూ తండ్రి లేదన్న భావన కలగకుండా పెంచింది.. ఆయనకు పెళ్లయి ఇద్దరు పిల్లలకు తండ్రైనా, 50 వసంతాలొచ్చినా, తల్లిచాటు బిడ్డగానే ఉంటున్నారు. అలాంటి మాతృమూర్తి మరణాన్ని తట్టుకోలేక... ఆమెకు అంత్యక్రియలు నిర్వహించిన 24 గంటల్లోనే అతని గుండె ఆగింది. ఈ హృదయ విదారక సంఘటన పెదవేగి మండలంలో చోటుచేసుకుంది. - న్యూస్‌టుడే, పెదవేగి



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

కూచింపూడికి చెందిన ఏనుగు గంగమ్మ(80) వృద్ధాప్యం రీత్యా శుక్రవారం మృతి చెందారు. కుమారుడు వెంకటేశ్వరరావు(50) తల్లికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తిచేశారు. సాయంత్రం ఇంటికి వచ్చినప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నారు. అమ్మనే తలచుకుంటూ రాత్రంతా నిద్రించలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ల వయసులోనే తండ్రి మరణించారు. దాంతో తల్లి గంగమ్మ అన్నీతానై కుమారుడ్ని పెంచింది. అతనికి వివాహం కాగా, ఇద్దరు పిల్లలున్నారు. 24 గంటల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

42 క్వింటాళ్ల చౌక బియ్యం పట్టివేత



వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం యాకమూరు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన వలస గంగరాజు తోట్లవల్లూరు పరిసర ప్రాంతాల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి టాటా వ్యాన్‌లో ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్‌కు చెందిన 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని యాకమూరు నుంచి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన సోల రాముకు తరలిస్తుండగా పోలీసులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార, పీడీఎస్, రెవెన్యూ వారి సమక్షంలో దాడులు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆదివారం తెలిపారు.

వివాహితను వేధిస్తున్న ఇద్దరిపై కేసు

ముసునూరు, న్యూస్‌టుడే: వివాహితను వేధిస్తున్న ఇద్దరిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ముసునూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను అక్కిరెడ్డిగూడేనికి చెందిన జంధ్యాల రాంబాబు, నాగరాజు నిత్యం ఫోన్ చేసి అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ వేధిస్తున్నారు. గ్రామంలో తన గురించి అసత్య ప్రచారాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాల వాహనాన్ని ఢీకొన్న వ్యాన్

ఆరుగురు భవానీ భక్తులకు గాయాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నిలిపి ఉన్న పాల వాహనాన్ని భవానీ భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ముకుందరాజుపేటకు చెందిన ఎనిమిది మంది భవానీ భక్తులు ఓ వ్యానులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. మార్గం మధ్యలోని శివారు ఆశ్రం సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు పక్కన ఆపి ఉన్న పాల వాహనాన్ని వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు భవానీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా- వారిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకరైన చెప్పా మాలశ్రీ ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన వైద్యం అందించండి.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవానీ భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ప్రమాద బాధితులకు అండగా ఉండాలని స్థానిక భాజపా నేతలకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏలూరు

•ఏలూరు •దెండులూరు •ఉంగుటూరు

అయ్యప్ప దీక్షాధారులకు భిక్ష

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పోణంగిలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాధారులకు భిక్ష కార్యక్రమాన్ని పీఎంజేఎఫ్ లయన్, మల్టిపుల్ కౌన్సిల్ వైస్‌ఛైర్మన్ దామర్ల శ్రీశాంతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఎ.పి. లయన్స్ సేవా యజ్ఞంలో భాగంగా 108 పాఠశాలల్లో శాంతి ప్రతిజ్ఞ, అయిదు నుంచి పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో పుస్తకాలు, ఆట సామగ్రి అందజేస్తున్నామని చెప్పారు. రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో తాము ముందున్నామన్నారు. అనంతరం ముందు అయ్యప్పస్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పీఎంజేఎఫ్ లయన్ కారలాల వేణుబాబు, అధ్యక్షుడు మల్లవల్లి చలపతిరావు, కార్యదర్శి కంది బాలకృష్ణ, కోశాధికారి తమ్మిన సాయికృష్ణ సుహాస్, సభ్యులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరండి: ఎస్పీ



పండ్లు అందజేస్తున్న ప్రతాప్ శివకిశోర్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి సొంతప్రాంతాలకు తిరుగు పయనమవుతున్న భవానీ భక్తులకు కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి అల్పాహారం, పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... భక్తులు సర్వీసు రోడ్లలో జాగ్రత్తగా నడవాలని సూచించారు. వాహనాల రాకపోకలను గమనించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండగ.. ప్రగతి నిండుగా!


★ నేటి నుంచి వారోత్సవాలు

★ వివిధ పనులకు శంకుస్థాపనలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే

దసరా ముగిసింది.. అయితేనేం, సోమవారం నుంచి పల్లెల్లో మరో పండగ షురూ కానుంది. వారం రోజులపాటు అట్టహాసంగా సాగనుంది. ఈ పండగలో గ్రామాల సమగ్రాభివృద్ధికి బీజం పడనుంది. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ 'పల్లె పండగ' పేరిట వారోత్సవాలు నిర్వహించనుంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో మురుగు కాలువలు, సీసీ, మట్టి రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేయనున్నారు. తదనుగుణంగా కలెక్టరు మార్గదర్శకాలు జారీ చేశారు.

87 పనులు.. రూ.15.85 కోట్లు



ఉంగుటూరు నియోజకవర్గంలో 14, 15 ఆర్థిక సంఘం నిధులను గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చేసింది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక, గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులను నిత్యం అనుశీలన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 23న నియోజకవర్గంలోని 81 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామస్థుల ఆమోదంతో అభివృద్ధి పనులకు 'పల్లె పండగ' పేరుతో శ్రీకారం చుట్టనున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.15.85 కోట్లతో 87 పనులు చేపట్టనున్నారు. ఈ పనులను మండల పరిషత్తు, పంచాయతీరాజ్, ఉపాధిహామీ అధికారులు పర్యవేక్షించనున్నారు.



సీసీ రోడ్డుగా మారనున్న వెల్లమిల్లి బురద దారి

పారదర్శకంగా...

పల్లె పండగలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఘనంగా చేసేందుకు ఏర్పాట్లు చేశాం. మండలంలో వివిధ పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేయనున్నాం. ఇప్పటికే జియో ట్యాగింగ్ కూడా పూర్తయింది. పారదర్శకంగా, నాణ్యతగా పనులు చేపడతాం. జనవరి నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించాం.

- జి.రాజ్ మనోజ్, ఎంపీడీవో

సమస్యల పరిష్కారానికి కృషి



వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి పూర్తిగా పడకేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గంలో 20 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 8 కి.మీ. మేర మట్టి రోడ్లు నిర్మించనున్నాం. ఈ పండగలో ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలి. **- ధర్మరాజు, ఎమ్మెల్యే, ఉంగుటూరు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు : 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: కొత్తూరు రాజీవ్ గృహకల్ప కాలనీ ఆరో రోడ్డులోని కాలువల్లో మురుగు ముందుకెళ్లడం లేదు. రోజుల తరబడి మురుగు పేరుకుపోయి దోమలకు ఆవాస కేంద్రంగా మారుతోంది. **- ఎల్.కృష్ణ, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

సమస్య: ఫిల్‌హౌస్‌పేట ఏడు కాలువల కూడలి వద్ద కాలువల్లో కొన్ని నెలలుగా పూడిక తీయడం లేదు. వాడుక నీరు వెళ్లే దారి లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- సీహెచ్ విశ్వనాథం, స్థానికుడు**

సమాధానం: ఒకట్రెండు రోజుల్లో కాలువలో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. **- శివరెడ్డి, నగరపాలక ఉప అధికారి**

సమస్య: కొత్తపేట నూకాలమ్మగుడి రోడ్డులో వారం రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. రాత్రివేళ పిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. **- వి.శివ నాగేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: సత్రంపాడు ఆర్టీసీ ఎంప్లాయీస్ కాలనీ ప్రధాన రోడ్డులోని కాలువలో మురుగు పారడం లేదు. దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోంది. **- డి.వెంకటేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: పడమరవీధి పాత గంగానమ్మగుడి సమీప బాలభవన్ రోడ్డులోని కాలువల్లో పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. **మనోహర్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందితో కాలువల్లో పూడిక తీయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక అదనపు అధికారి**

వెలిగిన వీధి దీపం

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: సత్రంపాడు ఎమ్మార్సీ కాలనీ రామాలయం రోడ్డులో వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. పది రోజులుగా దీపం వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 9న సమస్య ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి... సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయించారు.

కాలువలు శుభ్రం..

తంగెళ్లమూడి కబాడీ కాలనీ యానాదుల వీధిలో మురుగు కాలువలు పరిశుభ్రం అయ్యాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోందని ఈ నెల 8న ప్రచురితమైన సమస్యకు నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయించారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	దక్షిణ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	జిగ్రా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విశ్వం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌ను శనివారం అర్ధరాత్రి దాటాక పరిశీలించారు. ప్రయాణికులు బస్సులెక్కే సమయంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో... వాటిని కట్టడి చేసేందుకు బస్టాండ్‌ను ఆసాంతం క్షుణ్నంగా తనిఖీ చేశారు. అక్కడ సీసీ కెమెరాల పని తీరును గమనించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ప్రయాణికుల సమస్యలూ తెలుసుకున్నారు. బస్టాండులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నిఘా పెంచుతామని ఆయన పేర్కొన్నారు. డీఎస్పీ వెంట సీఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.



పాత బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పెదవేగి, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ అభ్యర్థుల సౌకర్యార్థం ఎన్డీయే ప్రభుత్వం వంద రోజులపాటు మెగా ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శిక్షణ శిబిరం గోడపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగ అభ్యర్థుల్లో నైపుణ్యం మెరుగుపర్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 22లోపు క్యాంపు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా అభ్యసన సామగ్రి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ నెల 27న ఏలూరు కేపీడీటీ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శిబిరాన్ని ప్రారంభిస్తామని, అవకాశాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరం పర్యవేక్షకులు కడియాల కృష్ణారావు, పి.దేవరత్నాకరరావు, నాగేంద్ర, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు సమష్టి పోరాటం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణకు సమష్టిగా పోరాడాలని పలువురు పిలుపునిచ్చారు. స్థానిక వసంతమహల్ కూడలిలోని కెనాల్ వంతెన వద్ద సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. సమితి కన్వీనర్ సి.ఎ.పి.శ్రీనివాస రామానుజాచార్యులు మాట్లాడుతూ... తమిళనాడులోని శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయ దివ్యక్షేత్రంలో అనేక అపచారాలకు కారణమైన అక్కడి పాలకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆలయ ఆగమ, పూజ, ఉత్సవ, మహోత్సవ విధానాల్లో అర్చకులకే పూర్తి స్వేచ్ఛనిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎ.బి.బి.ఎం.జోన్ అధ్యక్షుడు గురుశర్మ, బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షుడు కృష్ణమాచార్యులు, వ్యవస్థాపకుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'పాడనా తీయగా'

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన ఆదివారం పాడనా తీయగా కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ఆలపించిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. నేపథ్య గాయని ఐశ్వర్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమాలను అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్.పి.ఎస్ వాసు, వహీద పర్యవేక్షించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి దంపతులు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక పవరుపేటలోని కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, శ్రీదేవిభూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయాలను ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పోణంగి సమీప దేవీపురం కాలనీలో నూతనంగా నిర్మించనున్న యోనీశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి చంటి, మీనా దంపతులు ఆదివారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పిళ్లారిశెట్టి సురేష్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గ్రంధి బదరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు... మురిసిన భక్తులు




ఏలూరు: రాజరాజేశ్వరిదేవిగా అంబికాదేవి, పవరుపేటలో కాశీఅన్నపూర్ణ

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో పరిసమాప్తమయ్యాయి. దసరా సందర్భంగా ఆయా ఆలయాల్లోని అమ్మవార్లు తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చివరి రోజు మహిళలు ఆలయాలకు పోటెత్తి... జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్లను ఊరేగించి... సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. ఏలూరు నగరంతోపాటు పెదపాడు, పెదవేగి, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తరించారు. **- న్యూస్‌టుడే బృందం**



ఏలూరు: దత్తాశ్రమంలో...



పెదపాడు: రాట్నాలమ్మ



ఏలూరు: జమ్మిచెట్టుకు చీటీలు కడుతున్న భక్తులు



కనకదుర్గమ్మ ఊరేగింపు



ఉంగుటూరులో..



భీమడోలు: కనకదుర్గాదేవి గ్రామోత్సవం



ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక అర్జావారిగూడెంలో సమరసత సేవా ఫౌండేషన్, తితిదే శ్రీవాణి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యాన రూ.10 లక్షలతో నిర్మించిన రామాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో సీతారాములు, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ముందూరు యజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణచరణానంద, సమరసత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు, జిల్లా సంఘచాలక్ జి.సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవాని రంగ, ఎంపీటీసీ సభ్యుడు ముళ్లగిరి జాన్సన్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, గెడే కృష్ణప్రసాద్, విరజానంద తదితరులు పాల్గొన్నారు.



యాజమాన్యంతో ఎమ్మెల్యే ప్రభాకర్

ఆక్వా రంగంలో విప్లవాత్మక మార్పులు

పెదపాడు, న్యూస్‌టుడే: ఆక్వా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని... వీటిని వ్యాపారులు, రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. కొత్తూరులో కార్తికేయ ఆక్వా ఫీడ్ నీడ్ దుకాణాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రొయ్యల మేత తయారీలో దీపక్ నెక్స్‌జెన్ పరిస్థితులకు అనుగుణంగా, ఐఫీడ్ తయారీలో నాణ్యత పాటిస్తూ ఆక్వా రైతుల విశ్వాసం చూరగొంటోందన్నారు. గ్రామీణ, కొల్లేరు ప్రాంతాల ఆక్వా రైతులకు ఐఫీడ్ అందుబాటులోకి తీసుకొచ్చిన దుకాణ యజమాని నెక్కింటి కలికేశ్వరరావును ఆయన అభినందించారు. వాల్విన్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ కె.రాజేంద్రప్రభు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, తెదేపా నాయకులు ఎంఆర్‌డీ బలరాం, లావేటి శ్రీనివాసరావు, ఆక్వా రైతులు, దీపక్ నెక్స్‌జెన్ ఐఫీడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతినగర్ మూడో రోడ్డులో నివాసముంటున్న రేకపల్లి సౌజన్య ఓ పాఠశాలలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 7న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నై వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికొచ్చారు. తలుపులు తెరిచి ఉండటం గమనించి దొంగలు పడ్డారని గ్రహించారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా 12న అర్ధరాత్రి దాటాక ఓ దొంగ ఇంట్లోకి చొరబడి... బీరువాలో దాచిన 6 కాసుల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు నమోదై ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని సీఆర్ఆర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యురాలు చలసాని అరుణకుమారి ఉద్బోధించారు. స్థానిక పత్తేబాదలోని ఓ మినీ ఫంక్షన్ హాలులో ఆదివారం మాతృదేవోభవ సేవా ట్రస్టు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ వి.కృష్ణమోహనరావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిభా పాటవాలతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. విద్యతో పాటు సామాజిక పరిజ్ఞానం అవసరమన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరచిన 17 మంది విద్యార్థులకు రూ.1.70 లక్షలు, కొడాలి చంద్రరావు, బొల్లినేని రత్తయ్య రూ.60 వేల దాతృత్వంతో కలిపి మొత్తం రూ.2.30 లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. ఉండవల్లి లత, వేమా హరి నారాయణ, రాయంకుల రామారావు ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు ట్రస్టుకు విరాళం ఇచ్చారు. చివరిగా ట్రస్టు నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా చేపట్టారు. సమావేశంలో మైలవరపు లక్ష్మీ నరసింహారావు, నందమూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

చికిత్స పొందుతూ మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మాదేపల్లి గురకలపేటకు చెందిన మోరు అంతర్వేజమ్మ(68) ఈ నెల 7న ఇంట్లో వంట చేస్తుండగా.. చీర కొంగుకు ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతి చెందారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన 216ఏ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ద్వారకాతిరుమల మండలం సంద్రగుంటకు చెందిన పెనుమాల పండు, మేరీ దంపతులు తమ కుమారుడు అక్షయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఉంగుటూరు మండలం అప్పారావుపేటలో ఓ శుభ కార్యానికి బయల్దేరారు. మార్గం మధ్యలోని చేబ్రోలు వద్ద ద్విచక్ర వాహనాన్ని నూజివీడు నుంచి పెదతాడేపల్లి వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో మేరీకి తీవ్ర, పండు, అక్షయ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ రోడ్డు భద్రతా వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

కోళ్ల వ్యర్థాల లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న రెండు లారీలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు... విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను వివిధ గ్రామాల్లోని చేపల చెరువులకు మేతగా వినియోగించేందుకు తరలిస్తున్నారు. మార్గం మధ్యలోని వసంతవాడ వద్ద పోలీసులు తనిఖీలు చేసి లారీలను పట్టుకున్నారు. లారీల యజమానులతో పాటు డ్రైవర్లు, క్లీనర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజ ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.44,845 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

మలుపులు.. ప్రమాద పిలుపులు

పట్టించుకోని అధికారులు

పెదవేగి, న్యూస్‌టుడే

పెదవేగి మండలంలోని పలు ర.భ.శాఖ రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ప్రధానంగా ఆయా రోడ్లలోని మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనికి తోడు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రోడ్లను కమ్మేస్తున్నాయి. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల నాగన్నపాలెంలో చలపాటి రత్నకుమారి రోడ్డు దాటుతుండగా... మలుపు వద్ద ఆమె కనిపించక పోవడంతో ఓ ద్విచక్ర వాహనదారు ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నా... అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



రాట్నాలకుంట - పెదవేగి మార్గంలో..



గార్లమడుగు - లక్ష్మీపురం దారిలో...

ఆసుపత్రి పాలవుతున్నా...

మరికొన్ని ఘటనల్లో మలుపులను గుర్తించలేక వాహనదారులు అదుపు తప్పి పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రమాదకర మలుపు వద్ద అధికారులు సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉండగా- ఆ దిశగా చొరవ చూపిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా ర.భ.శాఖ అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. 'రహదారుల్లోని మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని ర.భ.శాఖ మండల ఏఈ బలరాం తెలిపారు.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

శ్రీనివాసా.. గోవిందా..!



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చిన వేంకన్న కొలువైన శేషాచలం శనివారం భక్తులతో కిటకిటలాడింది. విజయ దశమిని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది.

డొక్కా సీతమ్మ విగ్రహావిష్కరణ



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిరతాన్న దాత, అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అని శృంగవృక్షం శ్రీదత్తపీఠం ఆశ్రమ స్వామీజీ దత్త నాగానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు పంచాయతీరాజ్ శివాలయం ఎదురుగా విభాజకంలో వీహెచ్‌పీ నాయకుడు కేవీఆర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న వెంకటరామరాజు తదితరులు

ఇంటర్ విద్యార్థినికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పాలడుగుల ఐశ్వర్య కళాశాల, వసతి గృహం రుసుముల నిమిత్తం బయ్యనగూడేనికి చెందిన నాటకశాల వెంకటరామరాజు రూ.లక్ష సాయం ఆదివారం అందించారు. స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాజపా సీనియర్ నేత మల్లాది సీతారామారావు, ఎంబీ సోషల్ క్లబ్ అధ్యక్షుడు పద్మాకరరావు, చిట్రోజు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి..

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం రాఘవాపురానికి చెందిన పసుపులేటి పుల్లారావు పిల్లల చదువు నిమిత్తం జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు ఆదివారం రూ.10వేలు సాయం అందజేశారు.

నేడు తెదేపా సమన్వయ సమావేశం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: తెదేపా పోలవరం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం సోమవారం కొయ్యలగూడెం సమీపంలోని రేపల్లెవాడ రోటరీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాలినడక భక్తులకు పోలీసుల జాగ్రత్తలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కాలినడక భక్తులు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా భీమడోలు సీఐ విల్సన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం చర్యలు చేపట్టారు. దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భవానీ మాలధారులు, భక్తులు కలినడకన విజయవాడ వెళ్లి కనకదుర్గమ్మను దర్శించుకుని తిరిగి సొంత గ్రామాలకు కాలినడకన వెళుతున్న నేపథ్యంలో జాతీయ రహదారిపై ఎం.నాగులపల్లి వద్ద పోలీసులు పలు సూచనలు చేశారు. భక్తుల బ్యాగులు, వారి దుస్తులకు రేడియం స్టిక్కర్లు అంటించారు.

పల్లె గూటికి పండగొచ్చింది!

☛ గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణం ☛ నేటి నుంచి పంచాయతీ వారోత్సవాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

అప్పుడు.. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో బురద రోడ్లపై కనీసం గుప్పెడు మట్టి పోయాలన్నా నిధులు కోసం పంచాయతీలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. ఖాతాల్లో జమైన ఆర్థిక సంఘం నిధులను సైతం పాలక వర్గాలకు తెలియకుండానే అప్పటి ప్రభుత్వం మళ్లించడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.

ఇప్పుడు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం గత ఆగస్టు 23న ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించింది. గుర్తించిన పనుల కోసం సుమారు రూ.23 కోట్లు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి.

అచ్యుతాపురంలో పంచాయతీ కార్యాలయ మార్గంలో 200 మీటర్ల మేర సిమెంట్ రహదారి నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు సుమారు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. పంచాయతీ వారోత్సవాల్లో ఆయా పనులు చేపట్టనున్నారు.



వివరాలు ఇలా..

మండల	మొత్తం పనులు	మంజూరైన నిధులు (రూ.లక్షలు)
కొయ్యలగూడెం	84	637.00
పోలవరం	07	26.75
కుక్కునూరు	29	145.00
వేలేరుపాడు	02	10.00
జీలుగుమిల్లి	42	600.00
బుట్టాయగూడెం	48	300.00
టి.నరసాపురం	29	500.00

సర్పంచుల హర్షం

కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లో 193, రెండో జాబితాలో కొయ్యలగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 51 పనులకు నిధులు మంజూరయ్యాయి. గ్రామాల్లో వీధుల అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో విడుదల కావడంపై పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల పాటు ‘పల్లె పండగ’

ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు ‘పల్లె పండగ’ పేరుతో వారోత్సవాల నిర్వహణకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ప్రతి గ్రామంలో మంజూరైన సీసీ రహదారుల పనులు చేపట్టనున్నారు. వాటిని రెండు, మూడు నెలల్లో పూర్తి చేయాలని సంకల్పించారు. ఆయా పనుల భూమి పూజలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు 14, 15 తేదీల్లో కొయ్యలగూడెం మండలంలో పర్యటించనున్నారు.

కార్యాచరణ సిద్ధం

‘పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను రానున్న డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాము’అని పంచాయతీరాజ్ కొయ్యలగూడెం డీఈఈ ఎన్.సీతయ్య తెలిపారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే

సమస్య: టెక్కినవారిగూడెం నుంచి లక్కవరం మీదుగా దేవులపల్లి వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా పాడైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. -నరసింహమూర్తి, టెక్కినవారిగూడెం

సమాధానం: తాత్కాలిక మరమ్మతులకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు చేపడతాం. -హరికృష్ణ, డీఈ, ఆర్‌అండ్‌బీ, జంగారెడ్డిగూడెం

టి.నరసాపురం, న్యూస్‌టుడే

సమస్య: బొర్రంపాలెం నుంచి వీరభద్రవరం వెళ్లే రహదారిలో ఇటీవల మురుగు కాలువలో పూడిక తీయించి రహదారి పక్కన పడేశారు. వర్షం కురిసినప్పుడు రహదారి మొత్తం బురదమయంగా మారుతుంది. -చిల్లర వెంకట్రావు, బొర్రంపాలెం

సమాధానం: వర్షాలు తగ్గగానే సమస్య పరిష్కరిస్తాం. -కలపర్తి వెంకటేశ్వరమ్మ, సర్పంచి

తెలంగాణ సరిహద్దు దుకాణాలపై దృష్టి

కుక్కునూరు, వేలేరుపాడు, న్యూస్‌టుడే: మద్యం వ్యాపారుల చూపు కుక్కునూరు దుకాణాలపై పడింది. ఈ మండలంలోని 121వ నంబరు జనరల్ దుకాణానికి 108 దరఖాస్తులు దాఖలు కాగా.. జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. రెండోదైన ఎస్టీ రిజర్వ్‌డ్ దుకాణం దక్కించుకునేందుకు 75 మంది దరఖాస్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు, సువిశాల ప్రాంతం, ఎక్కువ గ్రామాల కారణంగా అమ్మకాలు భారీగా జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికి తోడు 50వేల లోపు జనాభా ఉండటంతో.. అనుమతులకు మొదటి ఏడాది రూ.55లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. గతంలో 2014లోనూ రెండు దుకాణాలకు కలిపి 200 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ మొదలవుతుంది. కుక్కునూరు దుకాణం 121 నంబరు కావడంతో ఆ లాటరీ వచ్చే సరికి సాయంత్రం 6 దాటే అవకాశాలు ఉన్నాయి.

గిరాకీ ఎందుకంటే.. మద్యం దుకాణాలకు దాఖలవుతున్న దరఖాస్తులను పరిశీలిస్తే తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వాటిపైనే వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. సరిహద్దు మండలాలు వేలేరుపాడు దుకాణానికి 74, చాట్రాయిలోని రెండింటికి 120, టి.నరసాపురంలోని మూడింటికి 154 దరఖాస్తులు పడ్డాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు సిండికేట్‌గా మారి సరిహద్దు మండలాల్లోని దుకాణాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

అ‘పూర్వ’ వేడుక



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల 1988-1993లో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సుమారు 42 మంది కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు, పాఠశాల సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కె.సోమరాజు, పి.సీతారామయ్య, కఠారి ప్రసాద్, ఎన్.కిశోర్‌బాబు, కె.సత్యవతి, చందూమణి, వి.రేణుక, యం.దేవి పాల్గొన్నారు.

‘స్థానిక గిరిజనులకే మద్యం దుకాణాలు కేటాయించాలి’

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం మండలాల్లో మద్యం దుకాణాలను స్థానిక గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు కోరారు. బుట్టాయగూడెంలో సంఘం మండల అధ్యక్షుడు రవ్వా బసవరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెసా చట్టం కింద గ్రామసభలు నిర్వహించి గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఆ తర్వాత దుకాణాల నిర్వహణకు అనుమతులు జారీచేయాలన్నారు. పొడియం కొవ్వాడయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రాయితీపై నిత్యావసరాలు



లబ్ధిదారులకు నూనె ప్యాకెట్లు అందజేస్తున్న రోషన్‌కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: నిత్యావసర ధరల పెరుగుదల భారం పేదలపై పడకుండా రాయితీతో సరకులు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో రాయితీతో కూడిన వంట నూనె ప్యాకెట్లను అందజేసే కార్యక్రమాన్ని స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వంట నూనె ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాధారులకు భిక్ష ప్రారంభం

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: కామవరపుకోట వీరభద్ర స్వామి ఆలయంలో 42 రోజుల పాటు నిర్వహించనున్న అయ్యప్ప దీక్షాధారుల మధ్యాహ్న భోజనం (భిక్ష) కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కీసరి రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అయ్యప్ప భక్తులతో పాటు హనుమాన్, భవానీ, వేంకటేశ్వరస్వామి, కుంకుళ్లమ్మ మాల ధారణ చేసిన భక్తులకు కూడా ఇక్కడ మధ్యాహ్నం భోజనం అందివ్వనున్నారు. కార్యక్రమంలో కాల్నీడి రాంబాబు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ● గురవాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాధారులకు మధ్యాహ్న భిక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు కమిటీ ఛైర్మన్ రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం సుమారు 50 రోజుల పాటు నిరంతరాయంగా జరుగుతుందని చెప్పారు.

18న విజయవాడలో కార్మిక సదస్సు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 18న రాష్ట్ర స్థాయి కార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక బోసుబొమ్మ కూడలిలో సదస్సుకు సంబంధించిన గోడ పత్రాలను నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, ఎస్.జయరాజు, శ్రీను, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా సంబరం.. అంబరం!



రాజరాజేశ్వరి అలంకరణలో జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ



కామవరపుకోటలో..

చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో శనివారం దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. అమ్మవార్లు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భారీ అన్నదానాలు చేశారు. అమ్మవారి గ్రామోత్సవాలు కోలాహలం నడుమ సందడిగా సాగాయి. అనంతరం ఉత్సవ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ రథోత్సవం కనుల పండువగా సాగింది. సాయిబాబా ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. -న్యూస్‌టుడే, బృందం



ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ రథోత్సవం



గూటాల కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



బుట్టాయగూడెంలో హోమాలు



వాసవీ కన్యకాపరమేశ్వరి..



దేవులపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో



యర్రంపేటలో శాకంబరిగా అంకాలమ్మ



కన్నాపురంలో అమ్మవారి ఊరేగింపు



వేలేరుపాడులో..

గుబ్బలమంగమ్మకు ప్రత్యేక పూజలు



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బలమంగమ్మ గుడికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కార్తిక మాసోత్సవాలకు పందిరి రాట

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో నవంబరు 2 నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసోత్సవాలకు ప్రారంభ సూచకంగా ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం పందిరి రాట వేశారు. ఈవో చందన, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాయిబాబాకు జలాభిషేకం

కుక్కునూరు, న్యూస్‌టుడే: శిర్డీసాయినాథుడు సమాధి అయిన రోజును పురస్కరించుకుని ఆదివారం కుక్కునూరు సాయిబాబా ఆలయంలో భక్తులు 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. పురోహితుడు వాడపల్లి సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

మదనగోపాలునికి పల్లకీ సమర్పణ



ఆలయ కమిటీ ఛైర్మన్‌కు అందజేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మదన గోపాలస్వామికి కన్నాపురానికి చెందిన ప్రగళ్లపాటి నాగరాజు దంపతులు టేకు కలపతో తయారుచేసిన రూ.లక్ష విలువైన పల్లకీని కానుకగా సమర్పించారు. ఆలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దు గోపాలకృష్ణకు అందజేశారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్సై జబీర్ అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరచరిత్రకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రజా శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను కామవరపుకోటలో ఆదివారం పట్టుకుని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి హెడ్ కానిస్టేబుల్ కె.రమేశ్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న వాహనాన్ని ఆదివారం జీలుగుమిల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు శివారు ప్రాంతాలకు చేపల మేతగా తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బోదెలో లారీ బోల్తా



కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: లారీ అదుపు తప్పి బోదెలోకి దూసుకెళ్లి బోల్తా పడిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున అచ్యుతాపురం వద్ద చోటుచేసుకుంది. బొగ్గు లోడు లారీ రాజమహేంద్రవరం వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న నాగమణి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల అమరులైన సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి, ఆర్ఎస్, బుద్ధదేవ్ భట్టాచార్యలకు ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘననివాళి అర్పించారు. పార్టీ బజారు జట్టు శాఖ మహాసభ కొయ్యలగూడెంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు మొడియం నాగమణి పాల్గొని మాట్లాడారు. అమరుల ఆశయ సాధనకు కృషి చేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బజారు జట్టు శాఖ నూతన అధ్యక్షుడిగా సాదుబోయిన శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ మండల కార్యదర్శి ప్రకటించారు. కార్యక్రమంలో శుక్లబోయిన రాంబాబు, మరిడయ్య, త్రిమూర్తులు, తమ్మారావు, గోపి, సుబ్రహ్మణ్యం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశువులను కబేళాకు తరలిస్తే చర్యలు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా కబేళాకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కేవీ రామారావు ఓ ప్రకటనలో హెచ్చరించారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం

లింగపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని శింగగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతి చదివి 545 మార్కులు సాధించిన షేక్ అస్మాబేగంకు.. పూర్వ విద్యార్థి మాడా వెంకటేశ్వరరావు రూ.10 వేలు, జ్ఞాపిక ఆదివారం అందజేశారు.

పొంచి ఉన్న ప్రమాదం!



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం మార్గంలో మర్లగూడెం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదభరితంగా మారింది. రాత్రిళ్లు దాటి వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. పాటెమ్మ గుడి సమీపాన చెట్ల కొమ్మలు విరిగి రహదారి మధ్యలో వేలాడుతున్నాయి. వీటిని తొలగించి, గొయ్యి పూడ్చి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ (పీఐయూ) ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

అధ్వానంగా అనుసంధానం



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెంలో జాతీయ రహదారి 516డి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన డ్రెయిను కల్వర్టు రహదారికి అప్రోచ్ (అనుసంధానం)గా పోసిన మట్టి ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. ఎగువన గ్రామంలోని మురుగంతా దిగువన చెరువులోకి పారేలా నిర్మించిన డ్రెయిను చివర్లో ఒకటి, రెండు వార్డులకు వెళ్లే రహదారికి అనుసంధానంగా మట్టి పోశారు. అది కొట్టుకుపోవడంతో గొయ్యి ఏర్పడింది. వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ర.భ.శాఖ(జాతీయ రహదారి) ఏఈ ఖాజాబాబు మాట్లాడుతూ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

సాయినాథుని శతాబ్ది పుణ్య తిథి



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సింగన్నగూడెం బస్టాప్ వద్ద ఉన్న సర్వకార్యసిద్ధి శ్రీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయిబాబా శతాబ్ది పుణ్యతిథి, మహాసమాధి కార్యక్రమాలు ఆలయ అర్చకుడు దేవలపల్లి లక్ష్మీ నరసింహాచార్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయదశమి ఏకాదశి పర్వదినం సందర్భంగా బాబాకి విశేష విభూది, అభిషేకాలు నిర్వహించారు. గోపాలపురం గ్రామానికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు, సుస్మిత దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. భక్తులు బాబా మహా సమాధిని దర్శించుకుని పుష్పాంజలి ఘటించారు.

నేడు సూరి భగవంతం విగ్రహావిష్కరణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలో జన్మించి తెలుగు వారు గర్వించేలా ఎదిగిన డా.సూరి భగవంతం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా, డీఆర్‌డీవో విజ్ఞాన సంఘానికి డైరెక్టర్ జనరల్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పని చేశారు. ఆయన 115వ జయంతి పురస్కరించుకుని ఈనెల 14న ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాద్రి లక్ష్మీనరసింహ వేద శాస్త్ర పాఠశాల(శ్రీమార్కండేయ సంస్కృత కళాశాల)లో ఆయన విగ్రహావిష్కరణ చేయనున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి కొలుసు పార్థసారథి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డా.జి.సతీశ్ రెడ్డి, వేద శాస్త్ర పాఠశాల కార్యదర్శి కలాల రమణారావు శర్మ, నేషనల్ బుక్ ట్రస్ట్ సభ్యులు జి.వల్లీశ్వర్ పాల్గొంటారని డా.సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.బి.రామ్ తెలిపారు.

గొంతెనమ్మకు ప్రత్యేక పూజలు



కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీలోని గొంతెనమ్మకు ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. చిన్నా పెద్ద అందరూ అమ్మవారి ఊరేగింపులో సందడి చేశారు.

37 దుకాణాలు.. 1264 దరఖాస్తులు

నూతన మద్యం విధానానికి భారీ స్పందన | ఒక్కోదానికి సగటున 25 | నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి

14న లాటరీ.. 16న విక్రయాలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానం రూపొందించి దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించింది. పలు రాష్ట్రాల్లో పరిశీలన అనంతరం కూటమి ప్రభుత్వం మెరుగైన విధానం తీసుకురావడంతో గతంలో మద్యం వ్యాపారం చేసిన వారే కాకుండా పలు వృత్తి విద్యా నిపుణులు సైతం తొలిసారిగా ఈ రంగంలోకి వచ్చేందుకు ఆసక్తి కనబర్చారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో 37 దుకాణాలకు 1264 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుం ద్వారా రూ.25.2 కోట్లు వసూళ్లయింది.

నూజివీడులోనే ఎక్కువ

కైకలూరు నియోజకవర్గం కంటే నూజివీడు నియోజకవర్గంలో దరఖాస్తులు అధికంగా వచ్చాయి. కైకలూరులోని నాలుగు మండలాల పరిధిలో 21 దుకాణాలకు 588 దరఖాస్తులు రాగా, నూజివీడు నియోజకవర్గంలో 16 దుకాణాలకు 676 దరఖాస్తులొచ్చాయి. నూజివీడు మున్సిపాలిటీలో ఓ దుకాణానికి అత్యధికంగా 54 దరఖాస్తులు రాగా, కైకలూరులోని 113వ నంబర్ దుకాణానికి అత్యల్పంగా 22 దరఖాస్తులు వచ్చాయి. కలిదిండి మండలంలో ఐదు దుకాణాలకు సగటున ప్రతి దుకాణానికి 33 పైన దరఖాస్తులొచ్చాయి. చాట్రాయి మండలంలోని రెండు దుకాణాలకు సగటున 47 పైన దరఖాస్తులు వచ్చాయి. ముసునూరు మండలంలోనూ ఇదే విధంగా వచ్చాయి.



దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కావడంతో పరిశీలన అనంతరం ఈనెల 14న దుకాణాల వారీగా లాటరీ తీస్తారు. దరఖాస్తుదారులు ఎంట్రీ పాసుతో పాటు గుర్తింపు కార్డుతో లాటరీ ప్రక్రియకు హాజరుకావాలి. లాటరీలో ఎంపికైన వారికి అక్కడే దుకాణం ఏర్పాటు, మద్యం అమ్మకాలకు అవసరమైన ధ్రువీకరణ, అనుమతి పత్రాలు అందిస్తారు. 16 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయి.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండలం	దుకాణాలు	దరఖాస్తులు
కైకలూరు	8	195
కలిదిండి	5	179
ముదినేపల్లి	5	128
మండవల్లి	3	86
చాట్రాయి	2	95
ముసునూరు	3	135
ఆగిరిపల్లి	4	161
నూజివీడు గ్రామీణ	4	141
నూజివీడు మున్సిపాలిటీ	3	144

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268 | కలిదిండి: 90594 84862

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: సింహాద్రిపురం సెంటర్ సమీపంలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ తీగజాతి పాదులు అల్లుకుని విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి తీగలను తొలగింపజేయాలి. **- ఎన్.రమేశ్, స్థానికుడు**

సమాధానం: అల్లుకున్న తీగలను వెంటనే తొలగిస్తాం. **- శ్రీను, లైన్‌మెన్**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని గోనిపాడు ప్రధాన కూడలిలో నాలుగు రోజులుగా పంచాయతీ వీధి దీపం సక్రమంగా వెలగడం లేదు. స్థానికులు రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- రామకృష్ణ, గ్రామస్థుడు**

సమాధానం: వెలగని వీధి దీపం స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తాం. **- రవికుమార్, పంచాయతీ కార్యదర్శి**

విజయకుమార్ సేవలు అభినందనీయం

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ఎంపీడీవోగా ఉద్యోగ విరమణ చేసిన వేమూరి ఏంజిల్ విజయకుమార్ దంపతులను నూజివీడు నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధికి ఆయన చేసిన కృషి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి.రవీంద్ర, నాగేశ్వరరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

నూజివీడు, న్యూస్‌టుడే: పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఆదివారం పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ మండలంలో పశు సంపద ఎక్కువ ఉందని, పశువులు పలు వ్యాధుల బారిన పడి చనిపోతున్నాయని, మండలంలోని పశువుల ఆసుపత్రిలో వైద్యుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన పశు వైద్యుడిని నియమించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు. గ్రామంలో రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్, సచివాలయాల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకురాగా.. వాటిని తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన కొల్లి పద్మ తమ తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుందని మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం మంత్రి అందజేశారు. నాయకులు రాజా, రమేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ఆత్మీయ వేడుక.. ఆనంద గీతిక!

నూజివీడు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1977-78 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నూజివీడులో సందడిగా నిర్వహించారు. అందరూ అక్కడకు చేరుకుని ఉల్లాసంగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలు తదితర అంశాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ మాజీ సీనియర్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావును మిత్రులు ఘనంగా సత్కరించారు. జీఎస్వీ ప్రసాద్, కె.అప్పలరాజు, కె.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శివరామకృష్ణ, శిరీష, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు.



నూజివీడు: 1977-78 బ్యాచ్ విద్యార్థుల బృందం

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు మండలం అన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి 2008-09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం సందడిగా నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో తొలి పూర్వ విద్యార్థుల సమ్మేళనం తమదేనని చెప్పారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నెరుసు నాగ శిరోమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం: మాట్లాడుతున్న పూర్వ విద్యార్థిని

అక్కడ స్వచ్ఛందం.. ఇక్కడ ఆక్రమణ!



వడాలిలో తొలగిస్తున్న మట్టి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలిలో ప్రధాన కాలువపై ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో ఇప్పటికే సుమారు 30 మందికి నోటీసులు జారీ చేశారు. ఆ గడువు సోమవారంతో ముగియనుండటంతో పలువురు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. డ్రెయినేజీ ఆక్రమిస్తూ వేసిన మట్టిని ఆదివారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఇదిలా ఉండగా మరో పక్క అన్నవరం పంట కాలువపై ఆక్రమణలు మొదలయ్యాయి. వడాలికి చెందిన వారు పంట కాలువపై షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ముందే వీటిని అడ్డుకోకుండా అనర్థం జరిగాక స్పందించడం దేనికని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వీఆర్వో పద్మను సంప్రదించగా.. పరిశీలించి పనులు నిలుపుదల చేయాలని సూచించామన్నారు. జలవనరుల శాఖకు చెందిన భూమి కావడంతో వారికీ సమాచారం అందించామని ఆమె వివరించారు.



పంట కాలువపై వేసిన రేకుల షెడ్డు

గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు బస్టాండ్ కూడలిలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు ఆదివారం గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. నాయకులు మరీదు శివరామకృష్ణ, ఎం.నారాయణరావు, కె.కృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, పామర్తి నాగేంద్ర, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఇదేనా చెత్త శుద్ధి

గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. గత ప్రభుత్వం పారిశుద్ధ్య పనులపై కంటే చెత్త పన్ను వసూళ్లపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను తొలగించింది. అయితే అధికారులు మాత్రం పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ లేక గ్రామ వీధులు చెత్త కేంద్రాలుగా మారుతున్నాయి. మండల కేంద్రమైన ముదినేపల్లిలోని ప్రధాన సెంటర్ వెంబడే చెత్త పేరుకుపోయింది. అటు వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ప్రతి సోమవారం ఇక్కడే వారపు సంత నిర్వహిస్తారు. అలాంటి ప్రదేశం దుర్వాసన వస్తుండటంతో వ్యాధులు ప్రబలతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త తొలగింపుపై చిత్తశుద్ధి కనబర్చాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ముదినేపల్లి**



ముదినేపల్లి సంత మార్కెట్ వద్ద ప్రధాన రహదారి వెంబడి ఇలా..

రొయ్యల చెరువు కాదండోయ్.. రోడ్డే!

ఈ చిత్రాన్ని చూసి చిన్నపాటి రొయ్యల చెరువు అని పొరబడకండోయ్ ఇది రోడ్డే. కలిదిండి మండలం ఆరుతెగలపాడు నుంచి కైకలూరు మండలం వరాహాపట్నం వెళ్లే మార్గం ఇది. ఇటుగా ప్రయాణించాలంటే ఈ చెరువును దాటాల్సిందే. ద్విచక్ర వాహనాలు వెళ్తున్న సమయంలో సైలెన్సర్‌లోకి నీళ్లు వెళ్లి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. కిందపడి పలువురు వాహనదారులు గాయాలపాలైన ఘటనలున్నాయి. ఇంత పెద్ద గుంతల్ని పూడ్చడానికీ అధికారులకు మనసు రావడం లేదంటూ చోదకులు నెత్తి, నోరూ బాదుకుంటున్నారు. **- కలిదిండి, న్యూస్‌టుడే**



వేలాడుతూ.. భయపెడుతూ..

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు నుంచి చింతలవల్లి వైపు వెళ్లే మసీదు వద్ద ఆర్అండ్‌బీ రహదారి పక్కన ఉన్న చెట్టుపై కొమ్మ విరిగి వేలాడుతోంది. విరిగి అటుగా ప్రయాణించే వాహనదారులపై పడే ప్రమాదం ఉంది. ఇది ప్రధాన రహదారి కావడంతో ఇటుగా నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. బలమైన ఈదురుగాలులు వీస్తే ఆనుకొని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మను తొలగించాలని పలువురు చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ అశోక్‌కుమార్‌ను సంప్రదించగా.. పరిశీలించి వెంటనే కొమ్మను తొలగిస్తామని తెలిపారు.



చెట్టుపై వేలాడుతున్న కొమ్మ

ఖాళీ జాగా వేసెయ్ పాగా!

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లిలోని జాతీయ రహదారి 165 వెంబడి మంచినీటి చెరువు గట్టు పొడవునా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు వెలిశాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాత పోలీస్‌స్టేషన్ కూల్చి రోడ్డును నిర్మించారు. ఈ ప్రాంతంలో మంచినీటి చెరువు గట్టుకు రోడ్డుకు మధ్యలో ఉన్న స్థలాన్ని సుమారు 50 మీటర్ల మేర దుకాణాలు నిర్మించేందుకు అనువుగా తాళ్లతో ఆక్రమించుకున్నారు. ఇప్పటికే మండవల్లి మంచినీటి చెరువు గట్టు సగం ఆక్రమణలకు గురయ్యింది. ఇప్పుడు ఉన్న మరి కొంత భూమి ఆక్రమిస్తే చెరువు కలుషితమవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి కొండలును వివరణ కోరగా.. ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



మండవల్లి జాతీయ రహదారి వెంబడి దుకాణాలు

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	మార్టిన్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వెట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వెట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	వెట్టయన్
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

అమ్మ పండగ.. మది నిండుగా..

న్యూస్‌టుడే, బృందం: దేవీ నవరాత్రులు ముగింపు సందర్భంగా నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆగిరిపల్లిలో రుద్రభూమి సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తోటపల్లిలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద శాస్త్ర పాఠశాలలో విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాట్రాయి మండలంలో ఏర్పాటు అమ్మవారి పందిళ్లలో ప్రతిమలను శనివారం నిమజ్జనం చేశారు. కోటపాడు పాత రామాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోపూడిలో శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. ముసునూరు, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, గోపవరం, కొర్లగుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల ప్రతిమలను ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు. అన్నవరంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు.

కైకలూరు నియోజకవర్గంలో.. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో శని, ఆదివారాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం జరిపించారు. అమ్మవారి మాలధారులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. పెయ్యేరు వడాలిలోని జగన్నాథస్వామి ఆలయంలో, విశ్వేశ్వరస్వామి, గురజ శివాలయంలో శనివారం రాత్రి శమీ పూజలు నిర్వహించారు. శ్రీహరిపురంలోని గంగానమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి మహిషాసుర దహనం చేశారు. కొర్రగుంటపాలెంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అంకురార్పన, మండపారాధన కుంకుమార్చనలు నిర్వహించారు. శివ లింగాకారంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. లోకుమూడి దత్తాశ్రమంలో ప్రత్యేక హోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.





ఆరుగొలనపేటలో ఊరేగింపు, శ్రీహరిపురం: మహిషాసుర దహనం

కనులు పండువగా తెప్పోత్సవం

కైకలూరు, న్యూస్‌టుడే: ఆలపాడు, వరహాపట్నం గ్రామాల్లో తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించారు. విద్యుద్దీప కాంతులతో అలంకరించిన హంస వాహనంపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలపాడులో నిర్వహించిన తెప్పోత్సవానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొనకాళ్ల జగన్నాథరావు(బుల్లయ్య) హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలపాడు: హంస వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

● వరహాపట్నంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఏర్పాటు చేసిన మహిసాసురుడి బొమ్మను దహనం చేశారు.



అంబరాన్ని అంటిన సంబరం

నూజివీడు, న్యూస్‌టుడే: ఆంధ్ర మైసూర్ నూజివీడులో దసరా వేడుకలు అంబరాన్ని అంటాయి. బుట్ట బొమ్మల ప్రదర్శన, ఐరావతం, గరుత్మంతుడు, కొలాటాలు, విచిత్ర వేషధారణలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్, బ్యాండ్లతో పట్టణం హోరెత్తింది. ఉయ్యూరు ఎస్టేట్‌లో కోటశివాలయం, వెంకటాచల స్వామి దేవస్థానం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన ఉత్సవ విగ్రహాలకు దివంగత ఎమ్మార్ అప్పారావు తనయుడు మేకా మెహర్ వెంకటాద్రి అప్పారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాలిలోకి తుపాకి కాల్చి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నూజివీడు కోటమహిషాసురమర్దని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యుత్తు దీప కాంతులు

హోరాహోరీగా చెడుగుడు పోటీలు

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ధర్మఅప్పారావు కళాశాల క్రీడా ప్రాంగణంలో స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెడుగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పురుషుల విభాగంలో రెండు జట్లు, మహిళల విభాగంలో రెండు జట్లు తలపడ్డాయి. శ్రీకాకుళం-గుంటూరు, విజయనగరం-కృష్ణా, కృష్ణా-పశ్చిమగోదావరి, విజయనగరం-శ్రీకాకుళం జట్ల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది.



తలపడుతున్న క్రీడాకారులు

అద్దాల మండపం ప్రారంభం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురంలోని శిర్డీ సాయి బాబా ఆలయంలో దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అద్దాల మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని మండపం, దాతలు అందించిన ఊయలను ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఛైర్మన్ పరసా ఏడుకొండలు, నాయకులు వీరమల్లు నరసింహారావు, సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, ఆలయ ఉపాధ్యక్షుడు నీలం నరసింహారావు, కార్యదర్శి మరిపి శివ, కొత్తూరి విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి దంపతులు

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరండి: ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికెళ్లి స్వస్థలాలకు తిరుగు పయనమవుతున్న భవానీ భక్తులకు కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి అల్పాహారం, పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... భక్తులు సర్వీసు రోడ్డులో జాగ్రత్తగా నడవాలని సూచించారు. వాహనాల రాకపోకలను గమనించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పండ్లు అందజేస్తున్న ప్రతాప్ శివకిశోర్